సాక్షి అనకాపల్లి

సోమవారం ၊ 13 ၊ అక్టోబర్ ၊ 2025



పచ్చనేత..భూముల మేత..!

- కొండపోరంబోకు కబ్జా
- రూ.20 కోట్ల విలువైన భూమికి ఎసరు

8లో

వాటే బ్యాటింగ్...!

- విశాఖ స్టేడియంలో పరుగుల వరద
- ఉత్కంఠ పోరులో కంగారూలదే విజయం



8లో

- రోడ్డెక్కిన గంగపుత్రులు

అణచివేతపై ఆగ్రహం

- బల్క్ డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా పెల్లుబికిన నిరసనలు
- జాతీయ రహదారి దిగ్బంధం
- నాలుగు గంటల పాటు ధర్నా
- హోంమంత్రి రాజీనామా చేయాలని నినాదాలు
- ఎస్‌ఐ, సీఐల సస్పెన్షన్‌కు డిమాండ్
- దిగి వచ్చిన కలెక్టర్, ఎస్పీలు
- మత్స్యకారులతో చర్చలకు అంగీకారం

గంగపుత్రులు సహనం కోల్పోయారు. బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులు విధిస్తున్న ఆంక్షలను తట్టుకోలేకపోయారు. ప్రాణాలు తీసే బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ నెలరోజులుగా చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించేందుకు వచ్చే వివిధ రాజకీయ పార్టీ నాయకులను, సహచర మత్స్యకార సంఘాలు, ప్రజా సంఘాల వారిని అడ్డుకుంటూ ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నాలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. నమ్మి ఓట్లేసిన హోంమంత్రి వంగలపూడి అనిత సైతం తమను పట్టించుకోకపోగా పోలీసులతో రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతో రగిలిపోయారు.. ఆదివారం రోడ్డెక్కి జాతీయ రహదారిని దిగ్బంధించారు...వివరాల్లోకి వెళ్తే...



బల్క్ డ్రగ్‌పార్క్ రద్దు కోరుతూ నక్కపల్లి జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మత్స్యకారులు



రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న మహిళలు



ఆందోళనకారులతో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీలు



మత్స్యకారులను అడ్డుకుంటున్న పోలీసులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలంటూ రాజయ్యపేటలో 29 రోజులుగా శాంతియుతంగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నారు. పోలీసులు టెంట్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో మండు టెండలోనే దీక్ష కొనసాగించారు. ఆందోళనకారులపై ఎడాపెడా కేసులు నమోదు చేస్తున్నారు. స్థానికేతరులెవరినీ గ్రామంలోకి రానివ్వడం లేదు. వీరికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ, జిల్లా, రాష్ట్ర నాయకులను అడ్డుకుంటున్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును వారం రోజుల నుంచి గృహ నిర్బంధం చేశారు. వారం క్రితం మత్స్యకారుల వద్దకు వస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను అడ్డుకున్నారు. ఆదివారం మత్స్యకారుల వద్దకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణను ఉపమాకలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. భారత యువజన చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్రయాద్‌ను వారం క్రితం రాజమండ్రిలో అడ్డుకున్నారు. కోర్టు అనుమతితో ఆదివారం ఇక్కడకు రావడానికి ప్రయత్నించిన ఆయనను విశాఖలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న మత్స్యకారులంతా ప్రభుత్వం ఉద్యమాన్ని నీరు కార్చాలని చూస్తోందని రగిలిపోయారు. దీక్షా శిబిరం వద్ద వంటావార్పు చేసుకుని భోజనాలు చేసి తాడోపేడో తేల్చుకునేందుకు నక్కపల్లి బయలుదేరారు. రాజయ్య పేట నుంచి 8 కిలోమీటర్లు కాలినడకన పిల్లాపాపలతో సహా ర్యాలీగా వచ్చి ఉపమాక రోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ దశలో పోలీసులు ఐదుగురు మహిళలపై దురుసుగా ప్రవర్తించడంతో వారికి చిన్నపాటి గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన మత్స్యకారులు జాతీయ రహదారి దిగ్బంధించారు. జాతీయ రహదారిపై ఉపమాక రోడ్డు జంక్షన్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు బైఠాయించారు.

నిర్బంధం ఎత్తివేయాలని....

వేలాది మంది మత్స్యకారుల నినాదాలతో జాతీయ రహదారి హోరెత్తింది. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు రాజశేఖర్, ఎరిపల్లి నాగేశు, సోమేష్, మహేష్, తదితరులు మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా నిలిచిన సీపీఎం నాయకులు అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, శీరం నర్సింహమూర్తి తదితరులను గృహనిర్బంధం చేశారని, వారిని తక్షణమే విడుదల చేసి ఇక్కడకు రప్పించాలని పట్టుబట్టడంతో పోలీసులు వారిని ఆందోళన వద్దకు అనుమతించారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దుచేయాలని, మత్స్యకారులు, నాయకులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, గ్రామంలో 144వ సెక్షన్ ఎత్తివేయాలని, మహిళలపై దురుసుగా ప్రవర్తించి గాయపరిచిన ఎస్‌ఐ సన్నిబాబు, ఎస్.రాయవరం సీఐ రామకృష్ణలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అధికారులకు చుక్కెదురు...

ఆర్డీవో రమణ, డీఎస్పీ శ్రీనివాస్‌లు వచ్చి చర్చలు జరుపుతామని, ఆందోళన విరమించాలని, జాతీయ రహదారి ఖాళీచేయాలని కోరినప్పటికీ ఆందోళన కారులు పట్టించుకోలేదు. మత్స్యకారులను మోసం చేసిన హోం మంత్రి రాజీనామా చేయాలని, కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వీడియో కాల్‌లో కలెక్టర్ మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆందోళన కారులు ఒప్పుకోలేదు. దీంతో ఎట్టకేలకు సాయంత్రం ఆరు గంటలకు కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా నక్కపల్లి చేరుకున్నారు. నెలరోజులుగా ఆందోళన చేస్తుంటే పట్టించుకోని మీరు ఇపుడు వచ్చి సమస్య ఏమీ తెలియనట్టు మాట్లాడడం సరికాదని మత్స్యకారులు అధికారులను నిలదీశారు. హోంమంత్రి సమస్యలు తెలుసుకుని కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు కదా అని కలెక్టర్ అడగడంతో మత్స్యకారులు మంత్రి తమను మోసం చేశారంటూ నినాదాలు చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. గాయపడిన మహిళలను కలెక్టర్, ఎస్పీలకు చూపించారు. ఇందుకు కారణమైన పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలన్నారు. దీంతో కలెక్టర్ మత్స్యకారుల డిమాండ్లు తెలుసుకున్నారు. బుధవారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేస్తానని మీ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పౌరుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడిందని జాతీయ రహదారిపై ధర్నా చేయడం సరికాదని ఆలోచించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ తమ సిబ్బందిపై ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి వాస్తవమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బుధవారం సమావేశం ఏర్పాటు చేస్తానని కలెక్టర్ ప్రకటించడంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు. జాతీయ రహదారిపై మత్స్యకారుల ఆందోళనతో సుమారు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సీఐటీయు నాయకులు కోటేశ్వరరావు, ఎం.రాజేష్, మత్స్యకార నాయకులు నాగేశు, సోమేష్, కోదండరావు, మహేష్, పిక్కి తాతీలు, మైలపల్లి సూరిబాబు, పిక్కి నూకరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.



హోం మంత్రి రాజీనామా చేయాలంటూ నినాదాలు చేస్తున్న మహిళలు



ధర్నా వద్ద భారీగా మోహరించిన పోలీసులు

నేతల నిర్బంధం దుర్మార్గం



దేవరాపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

దేవరాపల్లి: నక్కపల్లి మండలం రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్కును పెట్టొద్దని మత్స్యకారులు చేపడుతున్న ఆందోళనలో పాల్గొన్న సీపీఎం నేతల పట్ల ప్రభుత్వం, పోలీసుల తీరు అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును కొన్ని రోజులుగా పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ దేవరాపల్లిలో ఆదివారం నిరసన చేపట్టారు. రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా వేలాది మంది మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారని, దీనికి పరిశీలించేందుకు వెళ్లిన హోంమంత్రి అనిత గత నెల 29న వెళ్లగా మత్స్యకారులు కారును అడ్డగించి ఆందోళన చేపట్టారన్నారు. దీనికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు కారణమని గృహ నిర్బంధంలో ఉంచారని, ఇది అత్యంత దుర్మార్గమన్నారు. తక్షణమే అప్పలరాజుపై గృహ నిర్బంధాన్ని తొలగించాలని, లేదంటే ఈనెల 15న జిల్లా వ్యాప్తంగా అన్ని మండల ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పూడిమడక మత్స్యకారుల సంఘీభావం



పూడిమడక తీరంలో మత్స్యకారుల నినాదాలు

అచ్యుతాపురం: నక్కపల్లి మండలం రాజయ్యపేట పరిధిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ఉద్యమిస్తున్న మత్స్యకారులకు మద్దతుగా పూడిమడక మత్స్యకారులు ఆదివారం తీరప్రాంతంలో నిరసన తెలిపారు. మత్స్యకార్మిక సంఘం నాయకులు చేపల తాతయ్య మాట్లాడుతూ అప్పలరాజు, ఉమాదేవిని తొమ్మిది రోజుల పాటు గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. తీర ప్రాంతాల్లో నివసిస్తున్న మత్స్యకారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని, మరోవైపు తక్కువ ధరకు ఎక్కువ ఇమ్యూనిటీ పవర్ ఇచ్చే మత్స్యసంపద ఇక్కడి తీర ప్రాంతంలో దొరికే అవకాశం నానాటికీ తగ్గుతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇప్పటి హోం మంత్రి అనిత ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లాఠీలతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. కరక సోమునాయుడు, ఎల్లయ్య, రాజు, గుర్రయ్య, పోతురాజు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈల కిరికిరి

- మధురవాడ సర్వే నెం.296/14లో 5.33 ఎకరాలకు స్కెచ్
- నకిలీ సర్వే నంబర్ సృష్టించి.. ఆన్‌లైన్‌లో నమోదు
- సహకరించిన సర్వేశాఖ అధికారులు
- 296/6లోని భూమిని ఆక్రమించేందుకు యత్నం
- రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ప్రభుత్వ భూమిని ప్రైవేటు ల్యాండ్‌గా నమ్మించి ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు యత్నించడంతో పాటు నకిలీ ఈసీలు సృష్టించిన విద్యుత్‌శాఖ డీఈల ముఠా.. ఇప్పుడు అసలు ఉనికిలోలేని సర్వే నంబరునే సృష్టించారు. ఇందుకోసం ఏకంగా ఆన్‌లైన్‌లో కూడా సర్వే నంబరు ఉన్నట్టు మార్పులు చేశారు. అక్కడితో ఆగకుండా.. ఈ సర్వే నంబరులో ఏకంగా 5.33 ఎకరాల భూమి ఉందని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వ్యవహారంలో సర్వేశాఖ అధికారులు కూడా ఈ ముఠాకు సహకరించినట్టు తెలుస్తోంది. అయితే, లేని సర్వే నంబరును సృష్టించినందున.. మరో సర్వే నంబరులోని భూమిని ఇందులో చూపించేందుకు అనుగుణంగా ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ)లో మార్పులు చేసేందుకు యత్నించారు. తద్వారా మధురవాడలో అత్యంత విలువ చేసే 5.33 ఎకరాల భూమిని తమ చేతుల్లోకి తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించేందుకు కొద్ది మంది అధికారులతో లావాదేవీలు కూడా మాట్లాడుకున్నట్టు సమాచారం. వాస్తవానికి తమ శాఖలోనే వివిధ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది నుంచి మొత్తం రూ.25 లక్షల చొప్పున 200 మంది నుంచి రూ.50 కోట్లు వసూలు చేశారు. వీరందరికీ ఇప్పుడు ఈ సర్వే నంబరులోని భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామంటూ చెబుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా భూమి లేని లేని సర్వే నంబరును సృష్టించడమే కాకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించేందుకు యత్నించిన వ్యవహారంలో సదరు డీఈలు... తమకు మంత్రి అచ్చెన్నాయుడు తెలుసంటూ సహచర ఉద్యోగుల వద్ద చెబుతున్నట్టు తెలుస్తోంది.

ఖాళీగా ఉండటంతో....

మధురవాడలోని సర్వే నంబరు 296 సర్వే నంబరు భూమి... స్టేడియంకు ఎదురుగా ఉన్న ఎంవీవీ సిటీకి పక్కనే ఉంది. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ. 10 కోట్లు పలుకుతోంది. ఈ భూమిపై కన్నేసిన సదరు ముఠా.... 296/6లో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని రెండు ముక్కలుగా చేసి 296/14 సర్వే నంబరును సృష్టించారు. ఇందులో 5.33 ఎకరాల భూమి ఉన్నట్టు ఏకంగా ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. ఈ భూమి ఉన్నట్టు ఆన్‌లైన్‌లో ఎక్కించడంలో నేరుగా సర్వేశాఖ అధికారుల పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. సర్వేశాఖ ఏడీ ఒకరు నేరుగా ఇందులో ప్రధాన పాత్ర పోషించినట్టు సమాచారం. ఖాళీగా ఉండటంతో పాటు కుటుంబంలో తగాదాలతో వ్యవహారం కోర్టులో ఉండటం వీరికి కలిసొచ్చింది. అంతేకాకుండా సదరు కుటుంబం అంతా హైదరాబాద్‌లోనే మరో ప్రాంతంలోనే నివాసం ఉండటంతో ఇటువైపు గమనించే పరిస్థితి లేకపోవడాన్ని ఈ ముఠా అలుసుగా తీసుకున్నట్టు తెలుస్తోంది. అసలు ఉనికిలోలేని ఈ భూమిని చూపించి తాము వసూలు చేసిన రూ. 50 కోట్లలో కొందరికి ఇక్కడ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని సదరు ముఠా నమ్మిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా శ్రీకాకుళం జిల్లాకు చెందిన డీఈలు... తాము మంత్రి అచ్చెన్నాయుడు బంధువులంటూ చెప్పుకుంటుండటం గమనార్హం.

సర్వే నంబరు సృష్టించారు ఇలా..!

మధురవాడలోని సర్వే నంబరు 296 సర్వే నంబరులో మొత్తం 50.44 ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ సర్వే నంబరులో ఇప్పటివరకు కేవలం 13 సబ్ డివిజన్లు... అంటే 296/1 నుంచి 296/13 వరకూ ఉన్నాయి. ఆయా సబ్ డివిజన్లల్లో ఎవరెవరికి భూమిని కేటాయించారనే వివరాలను కూడా స్పష్టంగా స్థానిక రూరల్ తహసీల్దారు తన నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు అసలు ఉనికిలోనే లేని 296/14 సర్వే నంబరును సదరు ముఠా సృష్టించింది. ఇందుకోసం ఏకంగా ఆన్‌లైన్‌లోనే మార్పులు చేశారు. అంతేకాకుండా ఈ సర్వే నంబరులో 5.33 ఎకరాల భూమి ఉందని కూడా పేర్కొన్నారు. అయితే లేని భూమిని ఈ సర్వే నంబరులో చేర్చేందుకుగానూ 296/6లో ఉన్న 7.40 ఎకరాల భూమిపై కన్ను పడింది. వాస్తవానికి ఈ భూమికి పట్టా ఇచ్చారు. అయితే, కుటుంబ తగాదాల వల్ల ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. అందువల్ల ఈ సైట్‌లో ఎవ్వరూ ఉండటం లేదు. ప్రస్తుతానికి ఈ సర్వే నంబరులోని భూమి ఖాళీగా ఉంది. ఈ ఖాళీ భూమిపై సదరు ముఠా కన్నేసింది. ఈ సర్వే నంబరుకు చెందిన భూమిలోని 5.33 ఎకరాలకు 296/14 సర్వే నంబరులో ఉన్నట్టు చేర్చారు. అంతేకాకుండా ఇందుకు అనుగుణంగా ఎఫ్ఎంబీలోనూ మార్పులు చేసేందుకు యత్నించారు.

ఈపీడీసీఎల్‌లోనూ వసూళ్లు..!

జెన్‌కోకు చెందిన విజయవాడలోని ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్‌తో పాటు విద్యుత్ సౌధలో అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్న ఈ ఇద్దరు డీఈలు... జెన్‌కోలోని తమ తోటి ఉద్యోగులతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు (ఆర్‌టీపీపీ), కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంటు, ట్రాన్స్‌కోలో పనిచేసే ఉద్యోగులతో పాటు విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పని చేసే ఉద్యోగుల నుంచి కూడా చెరో రూ. 25 లక్షల చొప్పున వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ విధంగా మొత్తం 200 మంది నుంచి రూ. 50 కోట్లు వసూలు చేశారు. అంతేకాకుండా మధురవాడలోని సర్వే నెంబరు 296/14లోని భూమిని తమ బంధువుల పేరు మీద జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేసుకున్నట్టు కూడా చెబుతున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతో వ్యవహారం మాట్లాడుతున్నట్టు సమాచారం.



సర్వే నంబర్ 296/114 అనేది లేదని స్పష్టం చేస్తున్న ఎఫ్ఎంబీ స్కెచ్



సర్వే నంబర్ 296/13 వరకే ఉన్నాయని తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ఇది



296/14 ఉన్నట్టు తయారు చేసిన నకిలీ ఎఫ్ఎంబీ

వైకల్యం అధిగమించి 'గురు'తర విధులకు



అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమ పాఠశాల నిర్వాహకుడు పీఎస్‌టీ పట్నాయక్ వద్ద ఆశీస్సులు తీసుకున్న శంకరమ్మ

అచ్యుతాపురం: అచ్యుతాపురం వికలాంగుల ఇంటిగ్రేటెడ్ ఆశ్రమంలో చదువుకొన్న అంధురాలు ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎంపికై సోమవారం నుంచి విధులకు హాజరు కానుంది. ఈ క్రమంలో తనకు ఇంతటి మంచి భవిష్యత్ వచ్చేందుకు సహకరించిన ఆశ్రమ నిర్వాహకులు పీఎస్‌టీ పట్నాయక్ వద్ద ఆదివారం ఆశీస్సులు అందుకుంది. ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమంలో చదువుకుంటూ టీచర్ ట్రైనింగ్ పొందిన అంధురాలు దాసరి శంకరమ్మ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి మిగిలిన వారికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పట్నాయక్ మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం స్థాపించిన ఈ ఆశ్రమం ద్వారా ఎందరో వికలాంగులను తీర్చిదిద్ది మంచి భవిష్యత్ ఉండేలా ప్రోత్సాహించామని తెలిపారు. శంకరమ్మను టీచర్ ట్రైనింగ్‌లో చేర్పించానని,త ర్వాత ఇప్పుడు ఆమె ఉపాధ్యాయ పోస్టు సాధించి తన ఆశ్రమానికి మంచి పేరు తీసుకొచ్చిందని పట్నాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

మైనింగ్ చెక్‌పోస్టు పేరిట అడ్డగోలు వసూళ్లు



మార్టూరు మైనింగ్ చెక్‌పోస్టు వద్ద ట్రాక్టర్, లారీ యాజమానుల ఆందోళన

- ప్రైవేటు వ్యక్తుల దందా
- బిల్లు ఇవ్వకుండా నగదు వసూలు
- ఆగ్రహించిన ట్రాక్టర్, లారీ యజమానులు
- మార్టూరు మైనింగ్ చెక్‌పోస్టు వద్ద ఆందోళన

తుమ్మపాల: మైనింగ్ వాహనాలు రాకపోకలపై అధికారిక గణాంకాలతో పాటు మైనింగ్ బిల్లులంటూ మండలంలో మార్టూరు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టు అనధికారిక దోపిడీకి అడ్డాగా మారింది. మైనింగ్ ట్రావెల్ బిల్లులు పేరుతో లారీలు, ట్రాక్టర్‌ల నుంచి నగదు వసూలు చేసి బిల్లులు ఇవ్వకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు ఆందోళన చేశారు. మైనింగ్ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ప్రైవేటు వ్యక్తులతో నగదు వసూలు చేస్తున్నారని, ట్రాక్టర్లను కూడా అడ్డుకుని టన్నుల లెక్కన కాకుండా సరుకును బట్టి వసూలు చేస్తున్నారని, బిల్లులు అడిగితే ఇచ్చేది లేదంటూ భయపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్గ మధ్యంలో పోలీస్, ఆర్టీవో, మైనింగ్ అధికారుల తనిఖీల్లో బిల్లు లేకపోతే జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని, తాము చెల్లించే నగదుకు బిల్లు ఇవ్వనప్పుడు చెక్‌పోస్టు ఎందుకని, అధికారులు ముందుకొచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లారీల యాజమానులు బట్టి బిల్లులు వసూలు చేస్తూ ఒక్కో యజమానికి ఒక్కో రకమైన నగదు వసూలు చేయడంపై కూడా నిగ్గు తేల్చాలంటూ డిమాండ్ చేశారు. మండలంలో మార్టూరు, వేటజంగాలపాలెం, వెంకుపాలెం, మామిడిపాలెం, మాకవరం, బవులువాడ పలు గ్రామాల్లో గల అనేక క్వారీలు, క్రషర్లు లోడింగ్‌కు నగదు తీసుకుని బిల్లులు ఇవ్వడం లేదని, అదే కోవలో చెక్‌పోస్టులో కూడా బిల్లులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. మైనింగ్ శాఖ పేరుతో ప్రైవేటు వ్యక్తులు ట్రాక్టర్లు, లారీలను పట్టుకుని చెక్‌పోస్టు పేరుతో దారిదోపిడీ చేస్తున్నారన్నారు. అడ్డగోలుగా వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేటు వ్యక్తులను తొలగించి లారీ, ట్రాక్టర్ యజమానులకు న్యాయం చేయాలని కోరారు. అధికారులు స్పందించకుంటే ఉద్యమంగా ఏర్పడి మైనింగ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

చిటుక్కు చిటుక్కు..

తల బాగా వంచు తలంతా పేలే...ఏది బోర్లా పడుకో కడుపు కింద పేలు చూస్తా.. ఇదిగో కోతి చేష్టలు వద్దు...సరిగ్గా ఉండు...ముందుకు వంగో వీపుపై పేలు చూస్తా...అంటూ చక్కగా సేదతీరుతున్నాయి..కోతులు. బుచ్చెయ్యపేట మండలం లోపూడి పరిసర ప్రాంతాల్లో వానరాలు గుంపులుగా సందడి చేస్తూ సందర్శకులను అలరిస్తున్నాయి.

-బుచ్చెయ్యపేట





క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైందని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ కె.సంతోష్ కుమార్ అందించిన వివరాలు ప్రకారం పట్టణంలోని నాగవంశం వీధిలో నివాసముంటున్న పలకంశెట్టి జాహ్నవి(19) ఇంటర్మీడియట్ చదువుతుంది. ఇంటిలో తరచుగా ఫోన్ మాట్లాడుతుండడంతో ఈ నెల 9న తల్లి చంద్రామణి జాహ్నవిని మందలించింది. ఇంతలో అక్కడకు వచ్చిన తండ్రి కూతురిని తీసుకొని తన స్నేహితుడి ఇంటి వద్ద విడిచిపెట్టాడు. అయితే 10వ తేదీన ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు తల్లి చంద్రామణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల: దేవీ శరన్నవరాత్రులు ముగియడంతో ఆదివారం మోదకొండమ్మ ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. ఇక్కడ అమ్మవారిని దర్శించుకోవడానికి వేకువజాము నుంచే బారులు తీరారు. ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. పట్టణానికి చెందిన 101 మంది భక్తులు అమ్మవారి ప్రతి రూపమైన ఘటాలను నెత్తిన పెట్టుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

గురుకుల విద్యార్థినులకు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన విజేతలు

నర్సీపట్నం: తూర్పుగోదావరి జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి వుషూ చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు కొల్లగొట్టారు. సకిరెడ్డి హరిణి, ఐశ్వర్య, బొమ్మల ప్రేమజ్యోతి బంగారు పతకాలు సాధించారు. నూక గీతాంజలి, ముత్యాల కుసుమ వర్షిణి, మారేడుపూడి నిషిత కాంస్యం మెడల్స్ సాధించారు. వీరంతా నర్సీపట్నం డాక్టర్ బి.ఆర్. బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్నారు. మెడల్స్ సాధించి స్కూల్ గేమ్స్ వుషూ పోటీలకు అర్హత సాధించారు. పీడీ సాయి విజేతలను అభినందించారు. మొత్తం ఆరుగురు విద్యార్థినులు పాల్గొనగా, ముగ్గురు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని కోచ్ ప్రియాంక తెలిపారు.

పచ్చ నేత... భూముల మేత



అధికారం అండతో ఏకంగా రూ. 10 కోట్ల విలువ చేసే 20 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమిపై టీడీపీ మండల అధ్యక్షుడి కన్ను పడింది. 12 ఏళ్ల క్రితమే ఈ భూమిని ఆక్రమించిన ఆ నేతపై క్రిమినల్ కేసు నమోదుకావడంతో రెవెన్యూ అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకున్నారు. మరలా కూటమి అధికారంలోకి రావడంతో రూ.కోట్ల విలువ చేసే ఈ భూమిలో గత మూడు రోజులుగా జీడిమామిడి మొక్కలు వేయడం ప్రారంభించారు. వివరాల్లోకెళ్తే..

తామరం రెవెన్యూ 61/3 సర్వే నంబర్‌లో ఉన్న గెడ్డ పోరంబోకు భూమి

- 20 ఎకరాల గెడ్డ భూమిని ఆక్రమించిన టీడీపీ మండలాధ్యక్షుడు
- ఆక్రమణ భూమిలో నాటుతున్న జీడిమొక్కలు
- ఈ భూమి విలువ రూ.10 కోట్లు
- ఇదే భూ ఆక్రమణలో సదరు నేతపై 2013లో క్రిమినల్ కేసు నమోదు
- అధికారం అండతో తాజాగా మొక్కలు నాటుతున్న నేత
- కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం: మండలంలోని తామరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 61 3, 62లో సుమారు 25.50 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమి ఉంది. ఇందులో సుమారు 20 ఎకరాల భూమిని రాచపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుత మండల టీడీపీ అధ్యక్షుడు, ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు(ఆర్.వై.పాత్రుడు) ఆక్రమించాడు. గెడ్డలను తొలగించి భూమిని మొత్తం చదును చేసి పంటల సాగు చేసేందుకు సిద్ధం చేసుకున్నాడు. అంతేకాకుండా కోళ్లఫారం ఏర్పాటుకు షెడ్ల నిర్మాణం ప్రారంభించాడు. ఏకంగా ఉపాధి హామీ పథకంలో ఈ భూమికి రోడ్డును కూడా నిర్మించుకున్నాడు. దీనిపై 2013 డిసెంబర్‌లో పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు వెంటనే ఈ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు.

ఆక్రమణదారుపై క్రిమినల్ కేసు..

ఈ గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణపై అప్పటి నర్సీపట్నం సబ్ కలెక్టర్ శ్వేతాతెవాతియ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రికల్లో వార్తలు రావడంతో సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వానికి చెందిన ఈ 20 ఎకరాల భూమిని ఆక్రమించుకున్న ఆర్.వై. పాత్రుడుపై క్రిమినల్ కేసు పెట్టాలని అప్పటి తహసీల్దార్ గంగాధర్‌ను సబ్ కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆర్.వై.పాత్రుడిపై అప్పటి నర్సీపట్నం ఏఎస్పీ విశాల్‌గున్ని కేసు నమోదు చేశారు. ఆక్రమణ భూమిలో నిర్మించిన షెడ్డును తొలగించారు. ఈ నేపథ్యంలో 2013 నుంచి ఈ భూమి పిచ్చి మొక్కలతో ఖాళీగానే ఉండిపోయింది.


తవ్విన గోతుల వద్ద నాటేందుకు సిద్ధం చేసిన జీడి మొక్కలు

కూటమి అధికారంలోకి రావడంతో...

ఆన్‌రాక్ రిఫైనరీతో పాటు ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల కారణంగా ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరలా ఈ భూమిపై ఆర్.వై.పాత్రుడి కన్ను పడింది. ఇదే తడువుగా అతడి సోదరుడితో గత మూడు రోజులుగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయించాడు. కూలీలతో అయితే అధిక సమయం పడుతుందని భావించి పొక్లెయిన్‌తో గోతులు తీయించారు. నీటి ట్యాంకర్‌ను తీసుకువచ్చి జీడిమామిడి మొక్కలు నాటిస్తున్నాడు. ఇప్పటికే సుమారు పది ఎకరాల్లో మొక్కలు నాటేశారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

మండల కేంద్రానికి కూతవేటులో ఉన్న తామరం రెవెన్యూలోని గెడ్డపోరంబోకు భూమిలో ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులకు కనిపించకపోవడం విశేషం. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు పెడతామని ప్రకటనలు చేస్తున్న అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మూడు రోజులుగా మొక్కలు నాటుతున్నా అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడం, ఆపై మండలానికి టీడీపీ అధ్యక్షుడు కావడంతోనే అధికారులు మిన్నకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే దర్జాగా గెడ్డ పోరంబోకు భూమిని ఆక్రమించి మొక్కలు నాటుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.

కేసులు పెడతాం



తామరం గెడ్డ పోరంబోకు భూమి ఆక్రమణ విషయం నా దృష్టికి వచ్చింది. సిబ్బందిని ఆక్రమణ ప్రాంతానికి పంపించాం. ఈ ఆక్రమణలపై పూర్తిస్థాయి విచారణ చేస్తాం. మొక్కలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకుంటాం. ఆక్రమణదారులు ఎంతటి వారైనా కేసులు పెడతాం.

– బి.వెంకటరమణ, తహసీల్దార్, మాకవరపాలెం

వాటే బ్యాటింగ్...!



విశాఖ స్పోర్ట్స్: టీం ఇండియా భారీ స్కోరు.. కంగారూలను కలవరపెట్టడం ఖాయం అనుకున్న అభిమానులకు.. ప్రొఫెషనల్ ఆటకు బ్రాండ్ మేమే అన్నట్టు ఆస్ట్రేలియా బ్యాటర్లు పరుగుల వరద సృష్టించారు. భారత బౌలర్లను చీల్చి చెండాడారు. కళ్లు చెదిరే బౌండరీలు..బంతికి చుక్కలు చూపించేలా సిక్సర్లతో మోత మోగించారు. ఆస్ట్రేలియా సారథి అలిస్సా హీలీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.







ప్రభుత్వ స్థల ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు


పాలవలసలో రాత్రికి రాత్రి నిర్మించిన షెడ్


కొండప్రాంతానికి చేరుకున్న గ్రామస్తులు


ఆక్రమణ ప్రాంతంలో టెంట్ వేసి, నిరసన తెలుపుతున్న కూర్చున్న గ్రామస్తులు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ సర్వే నెం.82లో శనివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు కొండను తొలచి, చెట్లను తొలగించి షెడ్ నిర్మించడాన్ని గ్రామస్తులు పసిగట్టారు. పంచాయతీలో 21 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా సదరు ఆక్రమణదారుడు మూడున్నర ఎకరాల్లో చదును చేస్తున్నట్టు గుర్తించారు. ఈ ఆక్రమణకు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పాక్షికంగా చేపట్టిన షెడ్‌ను అడ్డుకుని కూలీలను చెదరగొట్టారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ పంచాయతీకి ప్రభుత్వ భూమి ఇక్కడ తప్ప మరెక్కడా లేదన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారుడు చదును చేస్తున్న మూడున్నర ఎకరాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థానికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదించిందన్నారు. ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియకు ఆటంకం కలిగిందన్నారు. గతంలో ఈ సర్వే నంబర్‌లో ఇద్దరు దళిత వ్యక్తులు, ఒక విశ్రాంత ఆర్మీ ఉద్యోగి తమకు భూములు ఉన్నట్టు ముందుకురాగా తామంతా పార్టీలకు అతీతంగా అడ్డుకున్నామన్నారు. భవిష్యత్తులో కూడా పంచాయతీకి సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ ఆక్రమణకు ప్రయత్నిస్తే వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. జాతీయరహదారిని ఆనుకుని దుక్కవానిపాలెం టోల్‌గేట్ సమీపంలో ఈ భూమి విలువ ఎకరం రూ.5 కోట్లు పైనే ఉంటుందని తెలిపారు. ఇదే సర్వే నంబర్‌లో కొన్ని ప్రభుత్వ భూములకు సంబంధించి వివాదాలు న్యాయస్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులే స్వయంగా యంత్రాలు తీసుకొచ్చి సర్వే నెం.82లో జంగిల్ క్లియరెన్స్ చేసుకున్నారు. వీఆర్వో దుర్గా రమేష్ అక్కడకు చేరుకుని ప్రభుత్వ స్థలాల్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరికైనా భూములకు సంబంధించి యాజమాన్య హక్కులు ఉంటే తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

నాడు సహాధ్యాయులు.. నేడు ఉపాధ్యాయులు


శ్రీ ప్రకాష్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1997 - 98 వ సంవత్సరంలో బీఈడీ చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు చాలా మంది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఎప్పుడూ పిల్లలకు పాఠాలు చెప్పే వీరంతా తాము చదువుకున్న కాలం నాటి సంఘటనలు నెమరు వేసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో అందరూ కలిసి సందడి చేశారు. 28 సంవత్సరాల తరువాత కలిసిన వీరందరూ అలనాటి తీపి గుర్తులని తలచుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత సిహెచ్ నరసింహారావు మాట్లాడుతూ సమాజ హితమే ఉపాధ్యాయుల ప్రథమ లక్ష్యమని అన్నారు. తమ దగ్గర చదువుకున్న విద్యార్థులు నేడు బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ రంగంలో ఉండి విద్యావ్యాప్తికి కృషి చేయడం ఆనందనీయమని, మున్ముందు వారు విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన వారిని ఆయన అభినందించారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా

ఉపాధ్యాయిని నాగజ్యోతికి 3 గోల్డు, ఒక రజత పతకం


ఉపాధ్యాయిని నాగజ్యోతి సాధించిన పతకాలు


ముఖ్య అతిథుల నుంచి పతకాలందుకున్న ఉపాధ్యాయిని నాగజ్యోతి

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం నాగజ్యోతి మరోమారు జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు. కర్ణాటక స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకూ 32వ నేషనల్ పవర్ లిఫ్టింగు చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మాస్టర్ 72 కేజీల విభాగంలో పాల్గొన్న పి.వి.ఎం. నాగజ్యోతి డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్, పుష్-పుల్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాల పరంపరను కొనసాగించారు. బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్స్, పుష్-పుల్ విభాగంలో సిల్వర్ మెడల్, టోటల్ పవర్ లిఫ్టింగ్ విభాగంలో మరొక గోల్డ్ మెడల్ వెరసి నాలుగు పతకాలు సాధించారు. కర్ణాటక సినీ నటుడు అహింసా చేతన్, రైతు, రాజకీయ నాయకులు నుంచి మెడల్స్ అందుకున్నారు. విద్యా రంగంలోనే కాకుండా క్రీడా రంగంలోనూ ప్రతిభ కనబరుస్తున్న నాగజ్యోతికి పలువురు అభినందనలు తెలిపారు.

నేడు కొత్త ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేరాలి

ఆరిలోవ: డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటీవల నియామకమైన 1,139 మంది కొత్త ఉపాధ్యాయులు సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. నియామకమైన వారికి ఇటీవల విద్యాశాఖ అధికారులు కొద్దిరోజులు శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి రెండు రోజులపాటు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి, పనిచేయాల్సిన పాఠశాలలను కేటాయించారు. ర్యాంకుల వారీగా కొత్త ఉపాధ్యాయులను గ్రామీణ, గిరిజన ప్రాంతాలలోని పాఠశాలల్లో భర్తీ చేసినట్లు డీఈవో స్పష్టం చేశారు. అయితే పట్టణ ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ, మెరిట్‌లో ఉన్న తమతో సహా అందరినీ గ్రామీణ, గిరిజన ప్రాంతాల పాఠశాలలకు పంపించడంపై కొందరు కొత్త ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రి పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ: కోరాపుట్‌కు చెందిన పూజారి నరసింగ్(28) ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. నరసింగ్ కోరాపుట్ జిల్లా కెందుగూడ గ్రామంలో కుటుంబ సభ్యులతో నివసిస్తూ.. స్థానిక ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అతను మద్యానికి బానిస కావడంతో విధుల నుంచి గ్రామస్తులు తొలగించారు. ఇటీవల అతని స్నేహితురాలు తులసిదాస్ అత్తగారికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెతో కలిసి మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆస్పత్రిలో కనిపించకపోవడంతో అతని భార్య పున్నీ పూజారికి తులసీదాస్ ఫోన్‌చేసి తెలిపింది. అదేరోజు అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడిపోవడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. ఆస్పత్రిలో రోగులను, వారి బంధువులను అప్రమత్తం చేయడంతో చనిపోయిన వ్యక్తి తనతోపాటు వచ్చిన నరసింగ్‌గా గుర్తించి ఆస్పత్రి వర్గాలకు తులసిదాస్ తెలిపింది. అత్యవసర వైద్య విభాగానికి తరలించగా, అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై అతని భార్య పున్నీ పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన


సినీ మేకర్ సత్యానంద్‌ను సత్కరిస్తున్న బొడ్డేడ తదితరులు


జయహో ఛత్రపతి శివాజీ మహరాజ్ నాటకంలోని సన్నివేశాలు

మునగపాక: స్థానిక నందీశ్వర తులసీ కళావేదికపై ఆదివారం రాత్రి ప్రదర్శించిన జయహో ఛత్రపతి శివాజీ మహరాజ్ నాటకం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ పెంటకోట జనరాజ్‌దాస్ 67వ జయంతిలో భాగంగా విజయవాడకు చెందిన సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్, ఏపీ సంస్కార భారతి సంయుక్త నిర్వహణలో ఈ నాటక ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ రామన్ ఫౌండేషన్‌కు చెందిన సాయిబాబా నాట్యమండలి వారి నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ నాటకానికి సంస్కార భారతి డాక్టర్ పీవీఎస్ కృష్ణ రచన, దర్శకత్వం వహించారు. 60 మంది కళాకారులు ఉత్తమ ప్రదర్శన గావించారు. పలువురు సాంకేతిక కళాకారులతో అద్భుతమైన యుద్ధ సన్నివేశాలతో భారీ సెట్టింగ్‌లు, వీనుల విందైన సంగీతం ప్రేక్షకులను అలరించాయి. ప్రదర్శనకు ముందుగా జనరాజ్‌దాస్ చిత్రపటం వద్ద మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, లీడర్ అధినేత విల్లూరి రమణమూర్తి, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, గౌరీ సంఘ జిల్లా అధ్యక్షుడు బుద్ధ శివాజీ, యువజన మందిర అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ నివాళులర్పించారు. జనరాజ్ దాస్ హయాంలో మునగపాక ఎంతో అభివృద్ధి చెందిందన్నారు.

సినీ మేకర్ సత్యానంద్‌కు సత్కారం...


రంగస్థల బాల నటునిగా నటన ప్రారంభించి బొమ్మలాట, గంగిరెద్దాట, రైలుబండి గారిడీ వంట వంటి నాటక ప్రదర్శనలు ఇచ్చి మునగపాకలో 30 మందికిపైగా కళాకారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన సినీ మేకర్ ఎల్.సత్యానంద్‌కు స్థానికులు ఘనంగా సత్కరించారు. సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాకారులు దాడి ముసిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, టెక్కలి కొండలరావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట విజయ్, మళ్ల రామజోగినాయుడు, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తీరానికి చేరిన మత్స్యకారుడి మృతదేహం


తీరానికి చేరిన బంగార్రాజు మృతదేహం

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన అరిజిల్లి బంగార్రాజు(17) మృతదేహం ఆదివారం ఉదయం దిబ్బపాలెం తీరానికి చేరింది. తోటి మత్స్యకారులతో కలిసి శనివారం తెల్లవారుజామున చేపలు వేటకు వెళుతున్న క్రమంలో కెరటాల తాకిడికి బంగార్రాజు పడవ నుంచి సముద్రంలోకి జారి, గల్లంతయ్యాడు. ఉదయం నుంచి రాత్రి వరకు మృతదేహం కోసం గాలించినా ఫలితం కనిపించలేదు. ఆదివారం ఉదయానికి మృతదేహం తీరానికి చేరింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న వెంటనే పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి'


ఇమంది పైడిరాజు

ఆరిలోవ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి(ఐఆర్) వెంటనే ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆదివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇంత వరకు ఐఆర్ ప్రకటించలేదన్నారు. దీంతోపాటు పెండింగ్ డీఏలు చెల్లించలేదని ఆక్షేపించారు. సాధారణ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు పీఆర్‌సీ కమిషన్ నియమించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ కింద ప్రతి ఉద్యోగి నెలా నెలా కొంత మొత్తం చెల్లిస్తున్నా.. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యం అందించేందుకు నిరాకరిస్తున్నాయని వాపోయారు. తక్షణమే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉచిత పథకం సరే.. బస్సులేవీ?

- ఆర్టీసీ బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షణ
- రద్దీకి తగ్గట్టు కానరాని బస్సులు
- సకాలంలో గమ్య స్థానాలకు చేరలేక అవస్థలు
- విద్యార్థులు, ఉద్యోగుల ఆవేదన



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



కశింకోట వద్ద మూకుమ్మడిగా బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, మహిళలు

కశింకోట: ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రయాణికులకు నరకం చూపిస్తోంది. ప్రయాణం అంటేనే రోత పుట్టిస్తున్న పరిస్థితి. ఉచిత ప్రయాణం కావడంతో అవసరం ఉన్న వారు, లేని మహిళలు సైతం బస్సుల్లో ప్రయాణానికి ఎగబడుతున్నారు. దీంతో ఉచిత బస్సు ప్రయాణం ఎవరు ప్రవేశ పెట్టమన్నారు? అంటూ మహిళలు ప్రశ్నిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. పథకం అమలుపై ఉన్న శ్రద్ధ.. రద్దీకి తగ్గట్టు బస్సులు పెంపుపై లేదని మండిపడుతున్నారు. పథకం ప్రారంభంలో సంబరపడిన మహిళలు డిమాండ్‌కు తగిన బస్సులు లేక విపరీత రద్దీ వల్ల సీట్లు లేక ఆద్యంతం నిలబడి ప్రయాణించాల్సి రావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, పెద్దలు, పురుషులు, పిల్లలు నిల్చుని సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు సకాలంలో కళాశాలలు, పాఠశాలలకు చేరలేకపోతున్నారు. బయ్యవరం, ఉగ్గినపాలెం, గొబ్బూరు, నూతలగుంటపాలెం తదితర ప్రాంతాల్లో బస్సులు నిలపకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. బస్సులు రద్దీగా ఉండటం.. ఖాళీ లేదనే సాకుతో స్టాప్‌ల్లో బస్సులు నిలపడం లేదు. దీంతో తర్వాత వచ్చే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. బస్సుల ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. మరోవైపు బస్సులు ఎప్పుడు వస్తాయో, అసలు వస్తాయో? రావో? తెలియని ఆగమ్యగోచర పరిస్థితిని మండల ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్నారు. దీంతో ఉచిత ప్రయాణానికి ఓ నమస్కారం అంటూ మహిళలు ఛీదరించుకుంటున్నారు. రద్దీకి తగ్గట్టు అదనపు బస్సులు లేక అవస్థలు తప్పడం లేదు. బస్సులు ప్రారంభ స్టేషన్‌లోనే సీట్లు నిండి కిక్కిరిసిపోతుండటంతో ఇక మధ్యలో ఉన్న గ్రామాల్లో ప్రయాణికులు బస్సు ఎక్కడానికి అవకాశం లేకుండాపోతోంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లో అధిక చార్జీలు చెల్లించి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అధికారులు స్పందించి అదనపు బస్సులు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సులు రద్దీతో మహిళల ఆటో ప్రయాణం

గ్రామాల్లో బస్సులు ఆపడం లేదు..



స్త్రీశక్తి పథకం అమలు తరువాత ఉగ్గినపాలెం, తదితర గ్రామాల్లో స్టాప్‌ల వద్ద బస్సులు ఆపడం లేదు. దీంతో అత్యవసర పని మీద వెళ్లే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖ వంటి ప్రాంతాల కళాశాలలు, పాఠశాలలకు ఎక్కువగా మండలం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు సకాలంలో కళాశాలలు, స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. పాఠశాల, కళాశాలల వేళల్లో అదనపు బస్సులు నడపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. మండల సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– కలగ గున్నయ్యనాయుడు, సర్పంచ్, ఉగ్గినపాలెం

స్టాపుల్లో బస్సులు ఆపేలా చర్యలు

అనకాపల్లి డిపో నుంచి నర్సీపట్నం, పాయకరావుపేట ప్రాంతాలకు రోజూ 12 వంతున పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నాం. ఇవి కాకుండా యలమంచిలికి మెట్రో, నర్సీపట్నానికి ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నాం. స్టాపుల్లో బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటాం.

– పి.ఎస్.రావు, సూపర్‌వైజర్, ఆర్టీసీ డిపో, అనకాపల్లి

క్లుప్తంగా

దాతలకు ఘన సత్కారం



కన్యకాపరమేశ్వరీ శత జయంతి ఉత్సవాల దాతలను సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో ఇటీవల జరిగిన అమ్మవారి ప్రతిష్ఠా శత జయంత్యుత్సవాలకు విరాళం ఇచ్చిన దాతలకు సత్కార కార్యక్రమం ఆదివారం జరిగింది. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో దాతలను ఆలయ ప్రతినిధులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కమిటీ చైర్మన్ యిమ్మిడిశెట్టి చక్రపాణి తయారు చేసిన కంచికా పరమేశ్వరీ వంద సంవత్సరాల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి దాతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శత జయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో–చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరావు, భక్తులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట: సొంత స్థలం కలిగి ఉన్న వారికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని, అర్హత ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ మండల ఇంజినీర్ వి.శ్రీనివాసరావు కోరారు. ఇప్పటికి 1021 మంది సొంత స్థలాలున్న వారు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో ఇప్పటికే 264 మందికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు (ఎల్‌పీజీ)లు అందజేశామన్నారు. ఇంకా మిగిలిన వారికి ఈ ఏడాది డిసెంబర్‌లో ఇవ్వనున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు పొందిన వారు ఈ ఏడాది డిసెంబర్‌లోగా నిర్మించుకోవాలన్నారు. లేదంటే ఆ పథకం రద్దు అవుతుందన్నారు. తర్వాత గృహ నిర్మాణ పథకంలో మళ్లీ ఇళ్లు కావలసినా ఇవ్వబోమన్నారు. దీని దృష్ట్యా సత్వరమే ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

సందడిగా హ్యాపీ సండే



సాధించిన బహుమతులతో విద్యార్థులు, అధికారులు

అనకాపల్లి టౌన్: విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఆట, పాటలు దోహదపడతాయని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్ జంక్షన్ వద్ద జీవీఎంసీ జోనల్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం హ్యాపీ సండే ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన క్లాసికల్ డాన్స్, వివిధ రకాల స్కిట్స్ ఆకట్టుకున్నాయి. తనకు లేకపోయినా అతిథులకు అన్నం వండి పెట్టే డొక్కా సీతమ్మ స్కిట్ ఆహూతులను ఆలోచింపజేసింది. జెడ్సీ మాట్లాడుతూ పిల్లలకు విజ్ఞానంతో కూడిన చదువును అందించాలన్నారు. ఆటల పోటీలు, డాన్స్ కార్యక్రమాలు, నాటికల స్కిట్‌లలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు

మునగపాక: క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. వాడ్రాపల్లిలో దీపావళి, నాగులచవితి వేడుకల సందర్భంగా ఈ నెల 23, 24 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీకి ఎంతో ఆదరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ యూత్, వీరాంజనేయ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 78 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్–16, బీ పాజిటివ్–25, ఓ పాజిటివ్–28, ఏబీ పాజిటివ్–06 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 356 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



డ్రోన్స్ ద్వారా పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల యూనిట్ ఇంచార్జ్ మళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మామిడిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పల రాజు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, డ్రోన్ ద్వారా మందుల పిచికారీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్గి తెగులు, సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో చేసిన కషాయాలను డ్రోన్స్ ద్వారా స్ప్రేయింగ్ చేయడం వల్ల ఎకరాకు రూ.1500 ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పూడి పరదేశీ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు



సర్పంచ్ పేరు లేని శిలా ఫలకం

అనకాపల్లి : మండలంలోని కొత్తూరు గ్రామంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పార్కు ప్రారంభోత్సవంలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదని ఎంపీపీ గొర్లి సూరిబాబు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆ కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం బాధాకరమన్నారు. కనీసం కొత్తూరు గ్రామ సర్పంచ్ ఎస్.లక్ష్మీ ప్రసన్నకు కూడా ఆహ్వానం అందించలేదన్నారు. అలాగే శిలా ఫలకంపై సర్పంచ్ పేరు కూడా వేయకపోవడం శోచనీయమన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న కూటమి నాయకులపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

అనకాపల్లి టౌన్: పశ్చిమ బెంగాల్‌లో ఐక్యూ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఒక సంఘటన మరువక ముందే మరో ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, సత్యనారాయణ, శివాజీ, వంశీకృష్ణ, దుర్గా, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

15న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం: ఈ నెల 15న సబ్బవరం సెక్షన్–1 కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఈ రామకృష్ణ, సీజీఆర్ఎస్ చైర్మన్ డాక్టర్ బి.సత్యానారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జ్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సురేఖరాణి, సభ్యులు ఎన్.మురళీకృష్ణ, ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొంటారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

తీరం.. ఘోరం..!

- చెత్తాచెదారంతో నిండిపోయిన ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతం
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు



ముత్యాలమ్మపాలెం సాగర తీరంలో చెత్తాచెదారం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం చెత్తాచెదారంతో నిండిపోయి ఘోరంగా తయారైంది. అధ్వానంగా మారిన తీర ప్రాంతాన్ని పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించడానికి పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. సముద్రం లోపలి నుంచి అలల ద్వారా కొట్టుకొచ్చిన అనేక రకాల వ్యర్థాలు తీరంలో చేరి పేరుకుపోయాయి. తీరం అందాలను తిలకిస్తూ సరదాగా కాసేపు గడిపేందుకు ఇక్కడికి వస్తున్న సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. తీరం వెంబడి ఎక్కడికక్కడ గాజు పెంకులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం దర్శనమివ్వడంతో కాలు మోపాలంటేనే భయపడుతున్నారు. ఆకతాయిలు వెంట తెచ్చుకున్న బీరు సీసాలు తాగి తీరంలో పగుల గొట్టడం వల్లఇసుకలో పెంకులు కూరుకుపోతున్నాయి. వీటి వల్ల పలువురు సందర్శకులు గాయాలపాలవుతున్నారు. గ్రామంలో మరణించిన వారికి తీరంలో దహన సంస్కారాలు పూర్తి చేసిన తరువాత కాలిన కర్రలు, బూడిదను అక్కడే వదిలిపెట్టడడం వల్ల సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తీరంలోని వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎ.భీమవరంలో సారె ఊరేగింపు



గౌరీపరమేశ్వరులకు సారెను సమర్పించిన భక్తులు

కె.కోటపాడు: ఎ.భీమవరం రామాలయంలో ఏర్పాటు చేసిన గౌరీపరమేశ్వరులకు సారెను భక్తులు సమర్పించారు. వివిధ రకాల పిండివంటలు తయారు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరమ్మకు సమర్పించారు. గౌరీపరమేశ్వరులకు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గౌరీపరమేశ్వరుల అనుపు కార్యక్రమాన్ని బుధవారం రాత్రికి వైభవంగా జరపనున్నట్లు సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, శేషు తర్రా మహేశ్వరరావు,చందు,పార్వతి తెలిపారు.

సందర్శకులు సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు జలకాలాటలు

నాతవరం: సరుగుడు జలపాతం సందర్శకులతో సందడిగా మారింది. ఆదివారం ఇక్కడ ఎత్తయిన రెండు కొండలు మధ్యలోంచి జాలువారే నీటిలో సందర్శకులు జలకాలాటాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. సరుగుడు రోడ్డులో ఒక్కసారిగా వాహనాలు రద్దీ పెరగడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. అదే విధంగా తాండవ రిజర్వాయరు వద్ద సందర్శకులు సందడి నెలకొంది. తాండవ రిజర్వాయరులో నీటిమట్టం పుష్కలంగా ఉండటంతో ఇక్కడా సందర్శకులు సరదాగా కాలక్షేపం చేశారు.

భగవద్గీతపై అవగాహన అవసరం



భగవద్గీత శ్లోకాలపై అవగాహన కల్పిస్తున్న ఆధ్యాత్మిక కర్త పరదేశినాయుడు

మునగపాక: ప్రతి ఒక్కరూ భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక కర్త శరగడం పరదేశినాయుడు కోరారు. మండలంలోని తిమ్మరాజుపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం భగవద్గీతపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పిల్లలు చదువుతో పాటు భగవద్గీతపై అవగాహన పెంచుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. పిల్లలు సన్మార్గంలో నడవాలని కోరారు.

జీతాలందక రెవెన్యూ సిబ్బంది అవస్థలు



బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం

బుచ్చెయ్యపేట: మండల రెవెన్యూలో కింద స్థాయి సిబ్బందికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగకు జీతం ఇవ్వకపోగా కనీసం దీపావళి పండగకైనా జీతాలు అందించి ఆదుకోవాలంటూ కోరుతున్నారు. ఈ నెల 12వ తేదీ దాటినా మండలంలో పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలకు జీతాలు అందలేదు. ఒకే కార్యాలయంలో పని చేస్తున్న తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులకు జీతాలు పెట్టుకుని డ్రా చేసుకోగా, కింద స్థాయిలో వీఆర్వో, వీఆర్ఏలు 50 మందికి మాత్రం జీతాలను నిలుపుదల చేశారు. దసరాకు జీతాలు అందక ఇబ్బందులు పడ్డామని, దీపావళికైనా ఇంటిల్లిపాది సరదాగా గడపడానికి జీతాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ కార్మికుల ధర్నా



వాల్‌పోస్టర్ ప్రదర్శిస్తున్న స్ట్రగుల కమిటీ సభ్యులు

చోడవరం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు విద్యుత్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకన్నపాలెం విద్యుత్ ఉప కేంద్రం వద్ద నిరవధిక సమ్మె గోడపత్రికను స్ట్రగుల్ కమిటీ సభ్యులు సిటు నాయకులుతో కలిసి విడుదల చేశారు. ఇందులో భాగంగా సోమవారం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు స్ట్రగుల్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, నర్సీపట్నం సంజీవ్‌కుమార్, ఆర్. సంజీవిరావు, వాసు సత్యనారాయణ, పూడి సత్యనారాయణ, సిటు నాయకులు ఎస్.వి. నాయుడు తెలిపారు. కాంట్రాక్టు, లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చెయ్యాలని, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలని, తదితర 12 డిమాండ్లుతో కూడిన సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం చేపట్టే చలో విజయవాడ విజయవంతం చేయాలని కోరారు.

వరికి తెగుళ్ల బెడద

- ఆందోళనలో రైతులు
- దిగుబడులు రావని వేదన



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మాడుగుల: వరి పంట తెగుళ్లు బారిన పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలు పోసుకుని గింజ కట్టే దశలో మాగుడు(పాముపొడ), తదితర తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పలు రకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. గోవాడ చక్కెర కర్మాగారం అప్పుల్లో కూరుకుపోవడంతో రైతులకు చెరకు బిల్లులు చెల్లించలేదు. దాంతో మండల రైతులంతా చెరుకు సాగుకు బదులు వరి సాగుపైనే ఆధారపడ్డారు. దీంతో మండలంలో 15 వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. నాట్లు సమయంలో ఎద్దడి రావడంతో నారులు ఎండిపోయాయి. వాటిని కుండలతో తడిపి కాపాడుకున్నారు. తీరా వర్షాలు అనుకూలించడంతో ఖరీఫ్ వరి నాట్లు గతేడాది కంటే ఆలస్యంగా వేసుకున్నారు. నాట్లు వేసిన వెంటనే యూరియా అందుబాటులో లేకపోవడంతో అరకొరగా ఎరువులు చల్లుకున్నారు.

వరుస తపాస్లు: ఈ ఏడాది వరినాట్లు వేసిన తర్వాత రోజూ వర్షపు జల్లులు కారణంగా ఖరీఫ్ వరి చేలుకు మాగుడు(పాముపొడ) తదితర తెగుళ్లు సోకాయి. వరి నాట్లు వేసిన దగ్గర నుంచి వర్షాలు అధికమవ్వడంతో క్రిమిసంహారక మందులు పని చేయడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది అంతగా దిగుబడులు రావని వాపోతున్నారు. తరుచూ ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో వరి చేలు నీటిముంపుకు గురవుతున్నాయి. రోజూ వర్షాలు కురవడంతో ఖరీఫ్ వరి చేలుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా నివారణ కాలేదని వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



ఈ ఏడాది ఖరీఫ్ వరి చేలుకు కలసి రాలేదు. వరినాట్లు సమయంలో ఎండలు మండిపోవడంతో కుండలతో నారు తడిపి కాపాడుకున్నాం. నాట్లు వేసిన తర్వాత అధిక వర్షాలు, యూరియా కొరత తదితర సమస్యలతో ఈ ఏడాది ఖరీఫ్ అంతగా కలసి రాలేదు. చెరుకు వేద్దామంటే బిల్లులు సరిగా ఇవ్వలేదు. వరి సాగుపైనే జీవనాధారం. ప్రస్తుతం వరి కూడా అంతంత మాత్రమే, ఎరువుల కొరత, వాతావరణం అనుకూలించక ఇబ్బందులు పడుతున్నాం. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చల్లా దేవుడు, రైతు, సత్యవరం, మాడుగుల మండలం

నేత్రపర్వంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీవరహా లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి అంతరాలయ దర్శనం, శేష వస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు.